# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 14-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కాశ్మీర్‌లోని గందేర్బల్ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన సోన్ మార్గ్ సొరంగ మార్గాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు.**
2. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు సంక్రాంతి సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.**
3. **ఢిల్లీలోని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.**
4. **సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.**
5. **తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ నీటి పారుదల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.**

=========================

కాశ్మీర్‌లోని గందేర్బల్ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన "సోన్ మార్గ్ సొరంగ మార్గా"న్ని నిన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జితేంద్ర సింగ్, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, టన్నెల్ ప్రాజెక్ట్ అధికారులు ఈ కార్యకమానికి హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో రహదారుల అనుసందానంతో పాటూ పర్యాటకానికి కూడా సోన్ మార్గ్ సొరంగం దోహదపడుతుందని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ ...31 సెకన్లు

-------------------------

ఈ రోజు మకర సంక్రాంతి పర్వ దినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించే సమయాన్ని సంక్రాంతి అంటారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తుండడంతో ఈ పండుగను మకర సంక్రాంతి అంటారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. అందమైన రంగ వల్లులు, హరిదాసు కీర్తనలు, ఎడ్ల పందాలు, ఎగిరే పతంగులతో పల్లెటూళ్ళు కళకళ లాడుతున్నాయి.

---------------------------

ఢిల్లీలోని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నివాసంలో నిన్న సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఈ వేడుకలను నిర్వహించారు. వేడుకలలో భాగంగా ప్రధాన మంత్రి భోగి మంటను వెలిగించి ... తులసి మొక్కను పూజించి .... గంగిరెద్దులకు పళ్ళను ఆరగింపచేశారు. తెలుగు చలన చిత్ర నటులు చిరంజీవి ..., పలువురు కేంద్ర మంత్రులు ..., ఉభయ రాష్ట్రాల ఎన్.డి.ఎ. పార్లమెంటు సభ్యులు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ ....

..వాయిస్...35 సెకన్లు

---------------------------

ఈ మకర సంక్రాంతి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. పాడిపంటలతో విరాజిల్లే పల్లె సీమలు మరింత కళకళలాడాలని, పెద్దలు చెప్పిన సంప్రదాయాల్ని పాటిస్తూ పండుగను మరింత ఆనందంగా చేసుకుందామని రాష్ట్ర ప్రజలకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ వేళ పల్లెలు పిల్లాపాపలతో కళకళలాడుతూ ఉంటే సంతోషంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యమని, ఆనందం, సిరి సంపదలతో గ్రామాలు సుభిక్షంగా శోభిల్లాలని ఆయన ఓ ప్రకటనలో అన్నారు. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి అందరి కుటుంబాల్లో భోగ భాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

తెలంగాణాలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెల 26వ తేదీ నుండి రేషన్ కార్డులను మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ కార్డుల మంజూరు కోసం అర్హతా ప్రమాణాల పరిశీలనకు ప్రభుత్వం ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్, గ్రేటర్ హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ లకు క్షేత్ర స్థాయీ పరిశీలనా బాధ్యతలు అప్పగించింది. ముసాయిదా జాబితాను గ్రామ సభ, వార్డులో ప్రదర్శించిన తరువాతనే ఆమోదం తెలపనున్నారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో మూడురోజుల పాటు నిర్వహించిన సౌత్ స్టేట్ లెవల్ ఎంఎల్ఏ కప్ వాలీబాల్ పోటీలలో మహిళల విభాగంలో సిద్దిపేట జిల్లా, పురుషుల విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్లు ప్రథమం సాధించాయి. విజేతలకు నిన్న రాత్రి జరిగిన ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట శాసన సభ్యులు పితాని సత్యనారాయణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడలకు పెద్దపీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. రానున్న ఐదేళ్లల్లో యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలతో పాటు ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

---------------------------

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ నీటి పారుదల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. 54 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే ఈ పథకం ద్వారా 27 చెరువుల కింద 2 వేల 400 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుందని చెప్పారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఖమ్మం జిల్లాను వ్యవసాయపరంగానే కాదు భవిష్యత్తులో పారిశ్రామికంగానూ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

---------------------------

బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, వాయవ్య భారతదేశం నుంచి వీస్తున్న పశ్చిమ గాలుల ప్రభావంతో రాబోయే రెండు రోజులు ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఈరోజు దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశముందని పేర్కొంది. కాగా నిన్న నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, అన్నమయ్య, పార్వతీపురం మన్యం జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడలో కనిష్ఠ ఉష్ణోగ్రత 8.2 డిగ్రీలుగా నమోదైంది.

---------------------------

కొమరమ్ భీమ్ జిల్లా జోడేఘాట్‌లో పర్యాటక అభివృద్ధి కోసం నాలుగు కోట్ల 96 లక్షల రూపాయల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోడేఘాట్ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనీ పేర్కొంటూ...

..వాయిస్... 25 సెకన్లు

కాగా.. కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయంలో ఆదివాసీల జాతరను సాంప్రదాయ బద్ధమైన ఆదివాసి దుస్తులు ధరించి మంత్రి ప్రారంభించారు. అంతకుముందు మంత్రి జనకాపూర్ గ్రామంలో బాల సదన్ కు వాంకిడిలో కెజిబివి జూనియర్ కళాశాలకు శంకుస్థాపన, జనకాపూర్ లో ఆదర్శ అంగన్ వాడి కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనంలో మ్యూజిక్ వాటర్ ఫౌంట్ ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని, స్మృతి వనాన్ని ప్రారంభించారని అన్నారు. భీమవరం పట్టణంలో సుందరీకరణ పనులను, పార్కులు, ప్రముఖ కూడళ్ళు, పచ్చదనం అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు.

---------------------------

తెలంగాణ రాజధాని హైదరాబాదులో సంక్రాంతి సందర్భంగా గాలిపటాల పోటీలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ పర్యాటక ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిన్న సాయంత్రం ఈ వేడుకలను మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు.

======================